www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 24 జూన్ 2023 | 5 | తూర్పుగోదావరి



యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మగ్గం, ఎంబ్రాయిడరీలో 30 రోజుల పాటు ఉచిత శిక్షణను అందించనున్నారు. శిక్షణకు వచ్చే అభ్యర్థులకు భోజనం, వసతిని ఉచితంగా కల్పిస్తున్నామని సంస్థ డైరెక్టర్ తాడి శ్రీనివాసరావు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వారికి మాత్రమే శిక్షణకు అర్హులన్నారు. శిక్షణకు వచ్చే అభ్యర్థులకు 18 ఏళ్లు నిండి ఉండాలన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగి కనీసం 8వ తరగతి చదివి ఉండాలని తెలిపారు. అర్హత కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు తమ కార్యాలయంలో గాని 7780599939, 0883-2420242, 2428807 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

అమలుకు నోచుకోని ప్లాస్టిక్ నిషేధం

యథేచ్ఛగా ప్లాస్టిక్ వినియోగం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్లాస్టిక్ భూతం నగరాన్ని పట్టి పీడిస్తోంది. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపిస్తున్నాయి. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. ప్లాస్టిక్ నిషేధం అమల్లోకి వచ్చి ఏడాదైనా మార్పు కనిపించడం లేదు. ప్లాస్టిక్ భూతాన్ని అధికారులు తరమలేకపోతున్నారు. ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు తప్పవని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నా ఎవరికీ చెవికెక్కడం లేదు. వ్యాపారులు ప్రత్యామ్నాయంగా జూట్ బ్యాగ్‌లు అందించే ప్రయత్నాలు చేయడం లేదు. ప్రజలు సైతం ప్లాస్టిక్‌ను తెగ వాడేస్తున్నారు. అందరి నిర్లక్ష్యాన్ని ప్లాస్టిక్ విక్రయాలు జరిపే హోల్‌సేల్ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. చూసీ చూడనట్లు ఉండే అధికారులకు భారీగానే ముడుపులు అందుతున్నాయి. అధికార పార్టీ నాయకులు కూడా జోక్యం చేసుకుంటున్నారు. ప్లాస్టిక్ నిషేధం ప్రకటనలకే పరిమితమైందన్న విమర్శలు వస్తున్నాయి. ప్లాస్టిక్ దందా వెనుక కొందరు రాజకీయ నాయకుల ప్రమేయం కనిపిస్తోంది.



16 రకాల ప్లాస్టిక్ నిషేధం

ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని అంతర్జాతీయంగా పర్యావరణ నిపుణులు హెచ్చరించటతో ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం ప్లాస్టిక్‌పై పూర్తి స్థాయి నిషేధం ప్రకటించింది. ఈ మేరకు గత ఏడాది ఆదేశాలు జారీ చేసింది. 16 రకాలైన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులపై కేంద్రం నిషేధం విధించింది. గత ఏడాది జూలై 1 నుంచి నిషేధం అమల్లోకి వచ్చింది. నిషేధించిన ప్లాస్టిక్ వస్తువులలో ఇయర్ బడ్స్ నుంచి బెలూన్ల వరకు ఉన్నాయి. ప్లాస్టిక్ ముడి పదార్థాలను సరఫరా చేయొద్దని పెట్రో కెమికల్ సంస్థలను సైతం కేంద్రం ఆదేశాలు వెలువడ్డాయి. ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హెచ్చరించారు. నిషేధించిన ప్లాస్టిక్ వస్తువుల జాబితాలో ఇయర్ బడ్స్, బెలూన్లు, క్యాండీ, ఐస్‌క్రీమ్ కోసం వాడే ప్లాస్టిక్ పుల్లలు, ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, ఫోర్కులు, చెంచాలు, కత్తులు, ట్రేలు, ప్లాస్టిక్ స్వీట్ బాక్సులు, ఆహ్వానపత్రాలు, సిగరెట్‌ప్యాకెట్లు, వంద మైక్రాన్ల లోపు ఉండే పీవీసీ బ్యానర్లు, అలంకరణ కోసం వాడే థర్మాకోల్ వంటి 16 రకాల వస్తువులున్నాయి. నిషేధం అమలులోకి వచ్చి పది నెలలైనా ప్లాస్టిక్ విక్రయాలు జరుగుతున్నాయి. నగరంలో తోపుడుబండ్ల నుంచి దుకాణాల వరకు ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తూనే ఉన్నారు. బార్లు, డాబాల్లో సైతం ప్లాస్టిక్ గ్లాసులు వాడేస్తున్నారు. కొన్ని డాబాలు, బార్లలో పలుచైన గ్లాసులు మద్యం తాగడానికి ఇస్తున్నారు.

వ్యాపారులకు రాజకీయ అండదండలు

నగరంలో ప్లాస్టిక్‌ను విచ్చలవిడిగా అమ్ముతున్నారు. హోల్‌సేల్‌గా విక్రయించే పెద్ద షాపులు కొన్ని ఉన్నాయి. వాటి నుంచే నగరంలోని దుకాణాలు, తోపుడుబండ్లతో పాటు జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాలకు, గ్రామీణ ప్రాంతాల్లో దుకాణాలకు ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు సరఫరా అవుతున్నాయి. ఈ హోల్‌సేల్ వ్యాపారులకు పలువురు రాజకీయ నాయకుల ఆశీస్సులు ఉన్నట్లు సమాచారం. వారి అండదండలతో వ్యాపారం మూడు కవర్లు ఆరు గ్లాసుల్లా సాగుతోంది. అందులో ఒకరికి గతంలో రూ.లక్షల్లో ముడుపులు అందినట్లు సమాచారం. మరొకరికి తరచూ కొన్ని షాపుల నుంచి వాటాలు అందుతున్నట్లు తెలిసింది. ప్లాస్టిక్ విక్రయ దుకాణాల్లో 90 శాతం ఇతర ప్రాంతాలకు చెందిన వారే ఉన్నారు. అధికారులు దాడులు చేసిన సందర్భాల్లో దుకాణ యజమానులు సంబంధిత కేంద్ర స్థాయి నాయకులతో ఫోన్లు చేయిస్తారని సమాచారం. దీంతో చాలా సందర్భాల్లో ఆ సరుకు వెనక్కు ఇచ్చేయడం, హోల్‌సేల్ దుకాణాలపై కూడా తూతూమంత్రంగా దాడులు జరుగుతున్నాయి. ప్లాస్టిక్ ఎక్కువగా దొరికినప్పటికీ రూ.వెయ్యి లేదా రూ.1,500 జరిమానాతో సరిపెట్టడం పరిపాటిగా మారిందనే విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి.



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

అభివృద్ధి పనుల వేగవంతానికి ఆదేశం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలో ప్రత్యేక నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కమిషనర్ కె.దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. నగరంలో రూ.125 కోట్ల ప్రత్యేక నిధులతో చేపట్టిన పనులు ఆయన ఇంజినీరింగ్ సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. కంబాలచెరువు పనులను పరిశీలించారు. బర్మా బ్రిడ్జి పనులకు పునాదులు వేయాలన్నారు. జిప్ లైన్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మ్యూజికల్ ఫౌంటైన్ పనుల ప్రగతిపై ఆరా తీశారు. సంబంధిత ఏజన్సీతో మాట్లాడి జులై నెలాఖరుకు దీన్ని సిద్ధం చేయాలన్నారు. కాంట్రాక్టర్లతో మాట్లాడి అన్ని పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆనం కళాకేంద్రంలో జరుగుతున్న పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. సుబ్రహ్మణ్య మైదానంలో ప్రస్తుతమున్న ఆడిటోరియంను తీసివేసి ఒపెన్ ఆడిటోరియంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. మైదానమంతా టైల్స్‌తో అందంగా మారుస్తామన్నారు. ఫుడ్ కోర్టు, పార్కింగు, సీటింగు సదుపాయములు ఏర్పాటు చేస్తామన్నారు. ఆనం కళాకేంద్రాన్ని రూ.6 కోట్లతో మరింత అందంగా తీర్చిదిద్దుతామన్నారు. పుష్కర ప్లాజా, పుష్కర ఘాట్ నుంచి వై జంక్షను వరకు చేపట్టిన స్ట్రీట్ స్కేపింగు పనులను పరిశీలించారు. పుష్కర ప్లాజాలో మిగిలివున్న పనులను మెరుగులు దిద్ది ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. స్ట్రీట్ స్కేపింగు పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. రోడ్డు విభాగిని పనులను పూర్తి చేయాలని, నిర్మాణం పూర్తి అయిన మార్జిన్లలో మొక్కలు వేయాలని అన్నారు. ఆయన వెంట ఎస్ఇ పాండురంగారావు, ఇఇలు, డిఇఇలు, ఎఇలు ఉన్నారు.

సిసి రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి -గోకవరం

గోకవరం పోలీస్ స్టేషన్ వెనుక వీధిలో సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఎంపిపి సుంకర శ్రీవల్లి, జడ్‌పిటిసి సభ్యులు దాసరి శ్రీరంగరమేష్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు ఆదేశాల మేరకు సిసి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామన్నారు. రూ.4 లక్షలతో నిర్మించనున్నామని తెలిపారు. అనంతరం గోకవరం వినాయకుని గుడి ఎదురుగా ఉన్న వెలపేటలో నూతనంగా నిర్మిస్తున్న డ్రెయినేజీ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దాసరి రమేష్, సుంకర వీరబాబు, వి.ప్రసాద్, కె.సూరారెడ్డి, సిహెచ్.అనిల్‌కుమార్, కె.ప్రకాష్, ఎం.సతీష్, తుమ్మల శివాజీ, పంచాయతీ కార్యదర్శి టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



శంకుస్థాపనలో పాల్గొన్న నాయకులు

మానవతా ఆధ్వర్యంలో బల్లల ఏర్పాటు

తాళ్లపూడి : గ్రామాల్లో ప్రజలు రద్దీగా ఉండే ప్రదేశాల్లో కూర్చునేందుకు అనువుగా మానవతా సేవా సంస్థ బల్లలను ఏర్పాటు చేస్తుందని మానవతా శాఖ అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు తెలిపారు. దీనిలో భాగంగా మండలంలోని మారుమూల గ్రామాల్లో రూ.17,500లతో బెంచీలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రీజనల్ చైర్మన్ వి.చంద్రయ్య మాట్లాడుతూ జులై 1న నుంచి మానవతా నూతన సభ్యత్వాలకు శ్రీకారం చుడుతుందన్నారు. ఎక్కువమంది సభ్యత్వం తీసుకుని మానవతా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఈసీ నెంబర్ సనపల రాజశేఖర్ పూర్వపు అధ్యక్షులు అప్పన చంద్ర ధర గుప్త తదితరులు పాల్గొన్నారు..



గోపాలపురంలో అవగాహనా ర్యాలీ

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - గోపాలపురం, తాళ్లపూడి

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి బారిన పడి బంగారు భవిష్యత్తును దూరం చేసుకోవద్దని ఎస్ఇబి ఎస్ఐ ఎం.రామశేషయ్య విద్యార్థులకు సూచించారు. శుక్రవారం గోపాలపురం హైస్కూల్లో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో భాగంగా ఎస్ఇబి సిఐ సుధా ఆదేశాల మేరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. చదువుకునే వయస్సులో డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మాదక ద్రవ్యాలతో పట్టుబడిన వారికి శిక్ష పడుతుందన్నారు. కేసుల్లో ఇరుక్కుంటే చదువు, ఉద్యోగాలకు దూరమవుతారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పి.సోమశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు. తాళ్లపూడిలో కొవ్వూరు సెబ్ సిఐ విటివివి.సత్యనారాయణ ఆధ్వర్యంలో వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్ అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టుదలతోనే విజయం : విసి పద్మరాజు

ప్రజాశక్తి - రాజానగరం

పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా విజయం సాధించొచ్చని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విసి ప్రొఫెసర్ కె.పద్మరాజు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్య ప్లానింగ్ బోర్డు ఆదేశాలతో అంతర్ విశ్వవిద్యాలయాల రీజనల్ గోదావరి క్లస్టర్ క్రీడలు శుక్రవారం రాజమహేంద్రవరం నన్నయ విశ్వవిద్యాలయంలో ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీలను విసి ప్రారంభించి మాట్లాడారు. యూనివర్సిటీలో క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. గోదావరి క్లస్టర్‌లో నన్నయతోపాటు జెఎన్‌టియుకె, వైఎస్ఆర్ హార్టికల్చర్, ఎన్ఐటి యూనివర్శిటీలు ఉన్నాయన్నారు. ఇలా నాలుగు ప్రత్యేక రంగాల విద్యార్థులంతా కలిసి ఒకచోట క్రీడల్లో పాల్గొనడం హర్షణీయమన్నారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. క్రీడల కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ రమణేశ్వరి మాట్లాడుతూ నాలుగు వర్సిటీలకు కబడ్డీ, బాస్కెట్‌బాల్, వాలీబాల్, చదరంగం విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సుమారు 250మంది క్రీడాకారులు పోటీపడుతున్నారన్నారు. తొలుత నాలుగు వర్సిటీల నుంచి వచ్చిన క్రీడాకారుల గౌరవవందనాన్ని విసి స్వీకరించారు. క్రీడల కార్యదర్శి డాక్టర్ రాంగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ టి.అశోక్, వర్సిటీ ఆచార్యులు, అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



క్రీడల ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న విసి పద్మరాజు



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆర్‌టిసి డిపోను అభివృద్ధి చేయాలని వినతి

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు ఆర్‌టిసి డిపో అభివృద్ధికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, సర్వీసులు పెంచి కొత్త బస్సులను ఏర్పాటు చేయాలని నిడదవోలు ఆర్‌టిసి డిపో సౌకర్యాల సాధన పోరాట సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. తనిఖీకి వచ్చిన డిపిటిఒ షర్మిలా అశోక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా డిపోలో నెలకొన్న సమస్యలను సంఘం నాయకులు జువ్వల రాంబాబు డిపిటిఒ దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల కాలంలో నిడదవోలు డిపో నుంచి కొన్ని బస్‌లను ఇతర ప్రాంతాలకు పంపేశారన్నారు. కొంత మంది సిబ్బందిని కూడా బయటకు పంపించారన్నారు. వారి స్థానంలో కొత్వరానికి నియమించలేదన్నారు. ఈ చర్యలతో డిపో మూసివేస్తారనే ఆందోళన ప్రజల్లో ఉందన్నారు. దీనిపై డిపిటిఒ మాట్లాడుతూ డిపోను మూసి వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. డిపో ముంపునకు గురి కాకుండా పటిష్టమైన చర్యలు చేపడతామన్నారు. డిపోను అభివృద్ధి చేస్తామన్నారు. నిడదవోలు-దేవరపల్లి, నిడదవోలు వయా కంసాలిపాలెం మీదుగా మాధవరం బస్ సర్వీసును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గారపాటి ప్రసన్నకృష్ణ, డొంకా రమేష్, అంబటి పుల్లారావు, తూరుగోపు నాని, శ్రీనివాస్, రవి, సాగర్, సిద్ధూ, ప్రయాణికులు పాల్గొన్నారు.

దాతలకు మద్దిపాటి అభినందన

ప్రజాశక్తి - గోపాలపురం

అన్నా క్యాంటీన్ ద్వారా 44 వారాలుగా పేదలకు కడుపు నింపేందుకు దాతలు ముందుకు రావడం పట్ల టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకట్రాజు అభినందనలు తెలిపారు. శుక్రవారం గోపాలపురం చెక్‌పోస్టు సెంటర్ వద్ద మద్దిపాటి రాజేష్ సౌజన్యంతో పేదలకు భోజనం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మద్దిపాటి వెంకట్రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచప మాట్లాడారు. ప్రతి శుక్రవారం నిరుపేదలకు ఉచితంగా కడుపు నింపేందుకు దాతలు ముందుకు రావడం గొప్పవిషయమన్నారు. మద్దిపాటి రాజేష్ 15 వారాల పాటు దానం చేయడం మరువలేనిదన్నారు. టిడిపి ప్రభుత్వం అన్నా క్యాంటీన్ల ద్వారా రూ.5కే కడుపు నింపేదన్నారు. ఇలాంటి క్యాంటీన్లను వైసిపి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యగా మూసేయడం దారుణమన్నారు. ప్రజల దాహార్తిని తీర్చే సత్య సాయిబాబా మంచినీటి పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్రపన్నుతోందన్నారు. నాలుగు నియోజకవర్గాల్లో 15 మండలాల్లో 220 గ్రామాలకు ఈ పథకం ద్వారా ప్రజలకు తాగునీరు అందుతుందన్నారు. వైసిపి ప్రభుత్వం హయాంలో 18 నెలల పాటు ఈ పథకాన్ని నిలిపేశారన్నారు. గుత్తేదారులకు నిధులు మంజూరు చేయకుండా, కార్మికులకు జీతాలు చెల్లించకుండా ఈ ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేయకుండా అవరోధాలు కల్పించారన్నారు. ఇప్పటికైనా స్పందించిన బిల్లులు విడుదల చేసి కార్మికులకు వేతనాలు అందించాలని కోరారు. లేనిపక్షంలో కార్మికుల పక్షాన టిడిపి ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.



అన్నం వడ్డిస్తున్న వెంకట్రాజు తదితరులు

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - సీతానగరం

కూనవరంలో 24 నుంచి 28వరకూ జరిగే కూనలమ్మ జాతరలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఇన్‌ఛార్జి ఎస్ఐ, నిర్వాహకులతో సమావేశమయ్యారు. నాలుగు రోజుల జాతరలో ఎలాంటి గొడవలు, అల్లర్లు, ప్రజలకు భంగం కలగకుండా శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని పోలీసులకు సహకరించాలన్నారు. గుండాట, పేకాట, కోత ఆట, కోడి పందేలు, హిజ్రా నత్యాలు, రికార్డింగ్ డ్యాన్స్‌లు వంటివి నిషేదమన్నారు. జాతరను ప్రశాంత వాతావరణంలో సంతోషంగా సంప్రదాయ నృత్యాలతో జరుపుకోవాలని పోలీసులు సూచించారు.

వైఎస్ఆర్ బీమా సొమ్ము అందజేత

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఇటీవల అనారోగ్యంతో మరణించిన తాళ్లపూడికి చెందిన నక్క రవికిరణ్ కుటుంబానికి మంజూరైన వైఎస్ఆర్ బీమా సొమ్మును గ్రామ కార్యదర్శి డిసిహెచ్.శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు అందజేశారు. తక్షణ సాయం కింద రూ.10వేలు శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ జి.గణేష్, పంచాయతీ సిబ్బంది ఎన్.రాజు, వాలంటీర్ సుందరకుమార్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - పెరవలి


ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులు ఆదేశించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం మధ్యాహ్నం తహశీల్దార్ టి.రాజేశ్వరి, ఎంపిడిఒ డి.దామోదరరావు అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు మాట్లాడారు. జగనన్న సురక్ష పథకంలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. సచివాలయంల పరిధిలో అర్హులను గుర్తించేందుకు ప్రతి వాలంటీర్‌తో ఇంటింటా తిరిగి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. హౌసింగ్ లే-ఔట్లు త్వరగా పూర్తిచేసి ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. బంగారు కొండ కార్యక్రమానికి దాతలను ఎంపిక చేయాలన్నారు. ఉపాధికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి కె.సీతారామ ప్రసాద్, హౌసింగ్ ఎఇ ఎలిపే వెంకన్నబాబు, ఎంఇఒ ఎస్.సూరజన్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగు లాభదాయకం

ప్రజాశక్తి -గోకవరం

సేంద్రియ సాగుతో రైతులకు ఎన్నో లాభాలు ఉన్నాయని నేచురల్ అసోసియేట్ ప్రగడ గౌతమ్ అన్నారు. శుక్రవారం మండలంలోని రంపఎర్రంపాలెంలో సేంద్రియ సాగు చేస్తున్న పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార ధాన్యాల ఉత్పత్తిలో సంవృద్ధిని సాధించినప్పటికీ సాగులో విచక్షణ రహితంగా వినియోగించే రసాయనాల వల్ల అనేక అనర్థాలు సంభవిస్తాయన్నారు. నేల భౌతిక లక్షణాలు దెబ్బతిని సామర్థ్యాన్ని క్రమంగా కోల్పోతాయని తెలిపారు నేల సహజత్వాన్ని కాపాడుకునేందుకు, అధిక దిగుబడులు సాధించేందుకు పచ్చిరొట్ట పైరు ఎంతగానో సాయపడుతుందన్నారు.గ్రామంలో పచ్చి రొట్ట పైర్లు పండించే రైతులను కలిసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐ.దేవి, పల్లపు శివ, బత్తిన సుధా, జాజుల సూర్యకుమారి, సౌజన్య పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



మనది పక్కచూపా..సార్..!!

జగనన్న సురక్షతో 11 రకాల సేవలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జగనన్న సురక్ష పథకంతో సత్వర సేవలు అందుతాయని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. ఈ పథకంలో భాగంగా 11 రకాలైన సర్వీసులను ఉచితంగా అందించనున్నారు. ఈ పథకంపై శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అవగాహనా సదస్సులు జరిగాయి. **గోకవరం** మండలంలోని రంపఎర్రంపాలెం పంచాయతీ కార్యాలయంలో ఎంఎల్ఒ వీరబాబు అధ్యక్షతన జగనన్న సురక్షపై వాలంటీర్లకు, గృహసారథులకు, కన్వీనర్లకు అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వైసిపి మండల కన్వీనర్ రాంబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్ఒ మాట్లాడారు. జగనన్న సురక్ష పథకాన్ని ముఖ్యమంత్రి శుక్రవారం ప్రారంభించారన్నారు. ఈనెల 24 నుంచి ఈ సేవలు ప్రారంభమవుతాయన్నారు. దీనిపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. **నిడదవోలు** మండలం పందలపాడు గ్రామంలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఎంఎల్ఎ జి.శ్రీనివాస్‌నాయుడు పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ప్రజల సమస్యలను, వినతులను నూరు శాతం పరిష్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. అలాగే నిడదవోలు రోటరీ క్లబ్‌లో నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కౌన్సిలర్లు షేక్ వజ్రద్దీన్, కామశెట్టి వీరవెంకట సత్యనారాయణ, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు. **తాళ్లపూడి** ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు. వాలంటీర్లు సేకరించిన సమాచారం ఆధారంగా జులై 1వ తేదీ నుంచి 23లోగా ఆయా వ్యక్తులు కోరుకున్న సర్టిఫికెట్లు జారీ చేస్తామన్నారు. ఈ కార్యక్శరమంలో ఎంపిడిఒ వెంకటరమణ, సచివాలయ సిబ్బంది, ఎంపిటిసి, వాలంటీర్లు పాల్గొన్నారు.



గోకవరంలో...



నిడదవోలులో మాట్లాడుతున్న ఎంఎల్ఎ శ్రీనివాస్‌నాయుడు

వైఎస్ఆర్ యంత్ర సేవ రైతులకు వరం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవ పథకం రైతులకు ఒక వరమని దాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. నవర గ్రామంలో వైఎస్సార్ యంత్ర సేవ పథకం ద్వారా మంజూరైన మినీ ట్రాక్టర్లను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ ద్వారా రైతులు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. యాంత్రీకరణ పద్ధతులను ఉపయోగించుకుని రైతులు ప్రయోజనం పొందే విధంగా జగన్ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందన్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ప్రారంభిస్తున్నందున లక్షలు విలువచేసే మినీ ట్రాక్టర్‌లను సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తుందన్నారు. కాగా ఈ సందర్భంగా రైతులకు మినీ ట్రాక్టర్‌లను హౌసింగ్ చైర్మన్ దొరబాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, వైస్ ఎంపిపిపి పేర్నీడి వేంకటరాయుడు, పార్టీ మండల అధ్యక్షులు తాటికొండ అచ్చిరాజు, సర్పంచ్ దమ్మాల లక్ష్మణ రావు, ఎంపిటి కేసారపు ప్రభాకర్ రావు, నాయకులు సత్తిబాబు, సూరిబాబు, ఎలిశెట్టి నరేష్, కొప్పిర్ది రాధా కష్ణ, గ్రామానికి చెందిన నాయకులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ఫోటోగ్రాఫర్స్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ గాంధీ భవన్ జగన్నాథపురం ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. అధ్యక్షునిగా పిళ్లా కళ్యాణరావు, కార్యదర్శిగా కొప్పాడి సతీష్, గౌరవాధ్యక్షునిగా ఆలీ, గౌరవ సలహాదారుగా అజీజ్, కోశాధికారిగా యాళ్ల రాజా, ఉప కోశాధికారిగా పండు, ఉపాధ్యక్షుడు జల్లి దేవి ప్రసాదు, అబ్బాస్, గండి అప్పారావు, ఉప కార్యదర్శి ఘంటసాల నాగరాజు, కెల్లా నాగు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కర్రీ అర్జున్, ఖాజా నిజాముద్దీన్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు జస్వంత్ శ్రీను, జిల్లా అధ్యక్షుడుతోట సూరి సుబ్బారావు, జిల్లా కార్యదర్శి సయ్యద్ కమర్, జోన్ ఇన్‌ఛార్జి శీలమంతుల గౌరీ శంకర్ పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

రైల్వే స్టేషన్‌లో చీఫ్ ఇంజనీర్ తనిఖీలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట రైల్వే స్టేషన్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్, టెలికమ్యూనికేషన్స్ ఇంజనీర్ జికె ద్వివేది శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రైలు ఇంజన్లో సిగ్నలింగ్ వ్యవస్థ పనితీరు, రైల్వే ట్రాక్‌ల తనిఖీల్లో భాగంగా సామర్లకోట నుంచి విశాఖ జిల్లా దువ్వాడ స్టేషన్ వరకు చేపట్టిన తనిఖీల్లో భాగంగా ఆయన ప్రత్యేక రైల్లో సామర్లకోటకు వచ్చారు. అనంతరం ఆయన స్టేషన్లోని సిగ్నలింగ్ యూనిట్‌ను పరిశీలించి సిగ్నలింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. రైళ్లలో ఇంజన్లో ఉన్న డ్రైవర్లకు సరైన విధంగా సిగ్నల్ అందుతున్నదీ లేనిదీ ప్రయోగాత్మకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో పలు శాఖల ముఖ్య అధికారులతో ఆయన సమావేశమయ్యారు. రైలు ప్రమాదాలు, భద్రత, ట్రాక్‌ల నిర్వహణ, సిగ్నలింగ్ వ్యవస్థ పనితీరు వంటి అంశాలపై అధికారులను సమీక్షించారు. విధి నిర్వహణలో ఎలాంటి అలక్షానికి గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకొని ప్రమాదాలకు తావు లేకుండా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఫ్లాట్‌ఫారాలను ఆయన పరిశీలించారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్టేషన్ మేనేజర్‌కు సూచించారు. స్థానిక స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ చీఫ్ ఇంజనీర్‌కు స్వాగతం పలికారు. ద్వివేది వెంట ఇంజనీర్స్ సతీష్ శంకర్, విశ్వనాథ రెడ్డి, సూర్యచంద్రరావు, అధికారులు సిబ్బంది ఉన్నారు.



తనిఖీలు చేస్తున్న చీఫ్ ఇంజనీర్ ద్వివేది

ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్

ప్రజాశక్తి-అమలాపురం

ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ అగ్రహారం వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఒలంపిక్ డే రన్ ను శుక్రవారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రారంభించారు. జిల్లాలో 22 సంవత్సరాల నుంచి ఈ కార్యక్రమాన్ని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ మెట్ల వెంకట సూర్యనారాయణ నేతత్వంలో నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్ తో పాటు ఒలంపిక్ డే రన్ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి కాశీ విశ్వనాథం రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు, అమలాపురం జోన్ వ్యాయామ ఉపాధ్యాయులు వాకర్స్ క్లబ్ సభ్యులు, ఆజాద్ ఫౌండేషన్ సభ్యులు, లైన్స్ క్లబ్ సభ్యులు, రోటరీ క్లబ్ సభ్యులు, చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు, ఆఫీసర్ రిక్రియేషన్ క్లబ్ సభ్యులు విధిగా పాల్గొన్నారు.



అమలాపురంలో ఒలింపిక్ డే రన్ లో పాల్గొన్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

రావులపాలెంలో సిఆర్‌సి ఆధ్వర్యంలో..

రావులపాలెం రావులపాలెం సిఆర్‌సి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఒలింపిక్ డే రన్ కార్యక్రమాన్ని స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఒలింపిక్ ర్యాలీని సిఆర్‌సి జనరల్ సెక్రెటరీ కర్రి అశోక్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం సిఆర్‌సి నందు ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. మే ఒకటి నుంచి జూన్ 15 వరకు ఉచిత కోచింగ్ నిర్వహించగా క్యాంప్ నందు శిక్షణ పొందిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన మేడపాటి శ్రీనివాసరెడ్డి (ఎం.ఎస్.ఆర్) ప్రసంగించారు. ప్రభుత్వం మంచి గుర్తింపు పొందిన టైక్వాండో, ఆర్చరీ, బాక్సింగ్ విద్యులు నేర్పిస్తున్న గ్రాండ్ మాస్టర్ అబ్బులను వారి బృందాన్ని అభినందించారు. ఎంఎస్‌ఆర్, సిఆర్‌సి అధ్యక్షులు తాడి నాగ మోహన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు సర్టిఫికెట్లును విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు, ఆర్గనైజర్స్ వెంకటలక్ష్మి, టి.లక్ష్మీ సందీప్ కిరణ్, మాస్టర్స్ పితాని సురేష్, మచ్చ దుర్గారావు, పత్తి నానిబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సహకారాలు అందించిన సిఆర్‌సి కార్యవర్గానికి మదర్ తెరిసా స్పోర్ట్స్ అండ్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఫౌండర్ అబ్బులు, కార్యవర్గం కతజ్ఞతలు తెలియజేశారు.కార్యక్రమంలో ధనలక్ష్మి టైల్స్ అధినేత సూర్య, మన్యం ప్రదీప్ పాల్గొన్నారు.



రావులపాలెం సిఆర్‌సిలో విద్యార్థులకు సరిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

నేరాలు ఘోరాలు

యువతి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- కాకినా కార్పొరేషన్

స్థానిక డిమార్ట్ దగ్గర్లో ఉన్న పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్న ఒక యువతిపై యాజమాన్యం దొంగతనం మోపడంతో పాటు కుటుంబ సభ్యులను బెదిరించడంతో ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ చావుబతుకుల మధ్య ఉన్న బాధితురాలు జ్యోతి సెల్ఫీ వీడియోలో తన ఆవేదన వ్యక్తం చేసింది. పెట్రోల్ బంకు యాజమాన్యం బలవంతంగా బాండ్ పేపర్లపై సంతకం తీసుకున్నారని, డబ్బులు ఎప్పుడు కడతావని ఇంటికి వెళ్లి బెదిరించారన్నారు. తనతోపాటు తన భర్తను చంపుతామని బెదిరించారని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పెట్రోల్ బంకు యజమానులకు కొమ్ము కాస్తున్నారని, ఇప్పటివరకు బంక్ యజమాన్యంపై కేసు నమోదు చేయలేదన్నారు. తనకు తన కుటుంబానికి ప్రాణహాని ఉందని, తమకు న్యాయం చేయాలని వేడుకుంది.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట పిఠాపురం రైల్వే స్టేషన్ల మధ్య శుక్రవారం రైలు ఢీకొని గుర్తుతెలియని సుమారు 30 ఏళ్ల వ్యక్తి మరణించాడు. సామర్లకోట రైల్వే ఎస్ఐ బి.లోవరాజు తెలిపిన వివరాలివి. రైల్వే ట్రాక్ పై గుర్తు తెలియని వ్యక్తి ఒక్కసారిగా పరుగులు తీయడంతో ట్రైన్ ఢీకొని శరీరం రెండు ముక్కలైంది. మృతుని ముఖం గుర్తుపట్టడానికి వీలు లేకుండా మారిపోయింది. మృతుడు సుమారు అయిదు అడుగులు ఎత్తు ఉండొచ్చు అని మృతుని వంటిపై తెల్లని షార్టు ఎరుపు నలుపు చారలు కలిగిన రౌండ్ నెక్ టీ షర్టు ధరించి ఉన్నట్లు చెప్పారు. మరే ఇతర ఆధారాలు లేవన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ మాస్టర్ దీపక్ రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సామర్లకోట రైల్వే దర్యాప్తు చేస్తున్నారు.

వరుస చోరీలతో ఆందోళన

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట పట్టణంలో వరుస చోరీలతో వ్యాపారుల్లో ఆందోళన పెరిగి పోతోంది. ఇటీవల సామర్లకోట స్టేషన్ సెంటర్‌లోని రథం సెంటర్ వద్ద ఒక చెప్పుల దుకాణంలో రాత్రి సమయంలో దొంగతనం జరిగింది. దానిలో సుమారు రూ.80 వేల విలువైన సొత్తు అపహరించినట్టు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ చోరీ ఘటన మరువక ముందే గురువారం రాత్రి ఆ సమీప మెడికల్ షాపులో మరలా దొంగతనం చోటు చేసుకుంది. ఈ చోరీలు షాపులో ఉన్న రూ.5 వేల నగదు చోరీకి గురైనట్లు తెలిసింది. యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు సిసి ఫుటేజ్‌ను పరిశీలించారు. దొంగతనాలకు పాల్పడుతున్న వారిని పట్టుకొనున్నట్టు పోలీసులు చెప్పారు. పట్టణంలో రకరకాల దొంగతనాలు ఇటీవల పెచ్చురిల్లు తున్నట్టు పలువురు బాధితులు వాపోతున్నారు. మోటారు సైకిళ్లపై వచ్చి వారు పడిపోతున్నట్టు నటిస్తూ ఎవరైనా వారికి సహాయం చేసేందుకు ప్రయత్నిస్తే చాకచక్యంగా వారి జేబుల్లోకి సెల్ ఫోన్లు, నగదు, బంగారు ఆభరణాలను దొంగిలించి పారిపోతున్నారని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ తరహా చోరీలపై పోలీసులు తగిన రీతిలో స్పందించి దొంగతనాలను నివారించాలని కోరుతున్నారు.

లారీ ఢీకొని మహిళ మరణం

ప్రజాశక్తి-పెద్దాపురం

జి.రాగంపేట-ప్రత్తిపాడు రహదారిలో దివిలి వద్ద శుక్రవారం ఇసుక లారీ ఢీకొని ఒక వద్దురాలు అక్కడికక్కడే మృతి చెందింది. పెద్దాపురం మండలం దివిలి గ్రామానికి చెందిన గంటా సూర్యకాంతం (55) సమీపంలోని సుబ్బారావు పేట కోళ్ల ఫారంలో పని చేస్తున్న భర్త లక్ష్మీపతికి శుక్రవారం భోజనం తీసుకుని వెళ్లి ఇచ్చింది. తిరిగి ఇంటికి నడుచుకుంటూ వెళు తుండగా రజక పేట వద్ద ఆమెను ఇసుక లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మీతి చెందింది.ఈ సంఘటన జరిగిన వెంటనే స్థానికుల సమాచారంతో ఎస్ఐ వి.సురేష్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ఆసుపత్రికి పంపించి కేసు నమోదు చేశారు.



అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్

యూజర్ ఛార్జీలపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

మెరుగైన పారిశుధ్య సేవల కోసం ప్రతిపాదించిన యూజర్ ఛార్జీల వసూళ్ళపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు ఆధికారులకు సూచించారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో యూజర్ ఛార్జీల వసూళ్లు, ఖాళీ స్థలాల గుర్తింపు, ఆస్తి పన్నుల వసూళ్ళు అంశంపై శుక్రవారం సాయంత్రం శానిటేషన్, రెవెన్యూ విభాగానికి చెందిన అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, నోడల్ ఆఫీసర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పారిశుధ్యసేవలు అందించాలనే లక్ష్యంతో హూపర్ టిప్పర్ వాహనాలను, ప్రత్యేకంగా సిబ్బందిని కూడా నియమించి ఇంటింటికీ చెత్త సేకరణ చేస్తున్నామన్నారు. ఇందుకయ్యే రూ.లక్షల వ్యయాన్ని యూజర్ ఛార్జీల ద్వారా మాత్రమే భరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అందువల్ల నిర్ణీత యూజర్ ఛార్జీలను విధిగా వసూళ్లు చేయాలని ఆయన సంబంధిత సిబ్బందికి సూచించారు.

నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు మాట్లాడుతూ యూజర్ ఛార్జీలు పూర్తిస్థాయిలో వసూళ్లు కాకపోతే ఆ ఖర్చు నగరపాలక సంస్థ సాధారణ నిధుల ద్వారా భరించాల్సి ఉంటుందన్నారు. ఇది నగరాభివద్ధిపై ప్రభావం చూపించే అవకాశం ఉన్నందున ప్రత్యేక దష్టి పెట్టాలని కోరారు. నగరంలోని ఆయా డివిజన్లలో ఉన్న ఖాళీ స్థలాలను, వాటి యజమానులను గుర్తించి అక్కడ చెత్త డంపింగ్ కాకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.



మాట్లాడుతున్న జగ్గంపేట జ్యోతుల నెహ్రూ

టిడిపి మేనిఫెస్టోపై ప్రచారం

ప్రజాశక్తి-జగ్గంపేట

టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు తయారు చేసిన ఎన్నిక మేనిఫెస్టోకు విస్తత ప్రచారం కల్పించాలని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేటలోని ఆయన అధ్యక్షతన శుక్రవారం జరిగిన బూత్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్తు గ్యారెటీని ప్రచారం చేస్తూనే వైసిపి ప్రభుత్వం విపరీతంగా దొంగ ఓట్లు చేర్పించిన విషయాలను బూత్ కమిటీలు వెలికితీయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడానికి బూత్ కమిటీలు సమగ్రంగా పని చేయాలని నెహ్రూ కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు జగ్గంపేట, కిర్లంపూడి మండలాల టిడిపి అధ్యక్షులు మారిశెట్టి భద్రం, చదరం చంటిబాబు, క్లస్టర్ ఇన్చార్జిలు జీను మణిబాబు, పైడిపాల సూరిబాబు, కొత్త కొండబాబు, వేములకొండ జోగారావు, మాజీ ఎంపిటిసి పీలా మహేష్, బూత్ కమిటీ ఇన్‌ఛార్జి పలివెల యేసు, రేఖ బుల్లి రాజు, ఉప్పలపాటి బుల్లబ్బు పాల్గొన్నారు.

రత్నగిరి యాత్రికులపై రవాణా భారం

ప్రజాశక్తి-అన్నవరం

దేవస్థానం కొండపైకి రైల్వే స్టేషన్‌కు వచ్చే యాత్రికులపై ఛార్జీల భారం మోపేందుకు నిర్ణయం తీసుకున్నారు. దీనికి సంబంధించి ఇప్పటివరకు కొండ పైనుంచి రైల్వే స్టేషన్‌కు రైల్వే స్టేషన్ నుంచి కొండపైకి రూ.15 నుంచి రూ.20 పెంచారు. కొండ కింద నుంచి కొండపైకి రూ.10 నుంచి రూ.15 వరకు పెంచారు. కాగా దేవస్థానంలో సేవ టికెట్లు ఇతరత్రా రేట్లు పెంచితే నిబంధనల మేరకు అభిప్రాయాల కోసం పలు ప్రదేశాల్లో నోటీసు బోర్డులు పెట్టాలి కానీ అటువంటివి ఏమీ లేకుండా రవాణా టిక్కెట్లు రేట్లు పెంచడంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు



గడప గడపకూ..లో దొరబాబు

ఆనూరులో గడప గడపకూ..

ప్రజాశక్తి - పెద్దాపురం

ఆనూరు గ్రామంలో శుక్రవారం సాయంత్రం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటింటికి కరపత్రాల పంపిణీ చేశారు. అనంతరం దొరబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అట్టడుగు, పేద వర్గాలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా అందజేస్తున్న సహాయ సహకారాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, ఎంపిపి పెంకే సత్యవతి పాల్గొన్నారు.

యానాం వార్తలు



అవగాహన సదస్సులో పాల్గొన్న అధికారులు

వ్యాధుల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - యానాం

ప్రాణాంతకరమైన మీజిల్స్, రుబెల్లా వ్యాధులను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు యానాం ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి అధికారి టి రవిశంకర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ప్రాంతీయ పరిపాలన అధికారి కార్యాలయంలో ఆర్ఎఒ మునిస్వామి అధ్యక్షతన మీజిల్స్, రుబెల్లా వైరస్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యానాంలో 2023 డిసెంబర్ కి మీజిల్స్,రుబెల్లా కేసులు లేని ప్రాంతంగా చేయడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ సన్యాల్, ఆసుపత్రి డాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో మరిన్ని సౌకర్యాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిలో అర్హులను గుర్తించి అవసరమైన సౌకర్యాలు ప్రభుత్వ అధికారులు అందజేయాలని ఎంపిపి రాయుడు సునీత అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా తాళ్లరేవు మండల పరిషత్ హాల్లో ఆమె అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనుపమ, పలు మండల శాఖ అధికారులు, ఆ సర్పంచులు, నాయకులు పేర్ని ఆదినారాయణమూర్తి, రెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ గణేష్‌కుమార్

గండేపల్లి కూడలిలో వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-గండేపల్లి

యువత లగ్జరీలకు అలవాటు పడితే దుష్పరిణామాలు తప్పవని ఎస్ఐ వై.గణేష్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన గండేపల్లి సింగరంపాలెం వెళ్లే కుడలి వద్ద వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆల్టర్నేట్ చేసిన మోడల్ జీప్‌ను ఆయన తనిఖీ చేశారు. వాహనాలు నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం ఎన్ని సూచనలు సలహాలు ఇచ్చినప్పటికీ హెచ్చరికలు పాటించడం లేదన్నారు.



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న మంత్రి వేణు

బాధిత కుటుంబానికి రూ.2 లక్షల సాయం

ప్రజాశక్తి- రామచంద్రపురం

నియోజవర్గంలోని గొల్లపాలెం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం జరిగిన ఘటనకు సంబంధించి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2 లక్షల చెక్కు అందజేశామని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకష్ణ తెలిపారు. శుక్రవారం సాయంత్రం రామచంద్రపురం లోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద బాధిత కుటుంబానికి చెక్కును అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇటీవల గొల్లపాలెం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం తెరిచే సమయంలో అనుకోకుండా ఒక బాలుడు చని పోవడం జరిగిందన్నారు. సంబంధిత అంగన్‌వాడీ హెల్పర్ ను సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. దీనిపై తక్షణం స్పందించి, ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని నష్ట పరిహారం అందించాలని ఉద్దేశంతో కాకినాడ జిల్లా యంత్రాంగం సంపూర్ణ సహకారం అందించిందని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో దుర్ఘటనలో మరణించిన బాలుడు మనోజ్ తండ్రి తేరి సత్తిబాబుకు మంత్రి చెక్కును అందించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సహాయం అందించడంలో త్వ రితగతిన చర్యలు చేపట్టిన కాకినాడ జిల్లా కలెక్టర్, జిల్లా యంత్రాంగాన్ని మంత్రి అభినందించారు.

మహిళా స్వశక్తి భవనం ప్రారంభం ఎప్పుడు?

ఎంఎల్ఎ వేగుళ్ల 8వ ఛాలెంజ్ సెల్ఫీ

ప్రజాశక్తి-మండపేట

స్థానిక గొల్లపుంత కాలనీలోని మహిళా స్వశక్తి భవనం ప్రారంభించేది ఎప్పుడని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ప్రశ్నించారు. శుక్రవారం మహిళా స్వశక్తి భవనంవద్ద ఆయన 8వ సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. 2018లో అప్పటి సిఎం చంద్రబాబు శంకుస్థాపన చేసారు. 2019లో భవన నిర్మాణం పూర్తైన ఇప్పటికీ ఎందుకు ప్రారంభించలేదు ప్రజా ప్రతినిధులు సమాధానం చెప్పాలన్నారు. ప్రజలకు అవసరమైన పనుల కోసమే తను సెల్ఫీ ఛాలెంజ్ చేస్తున్నానని వాటిని తక్షణం పరిష్కరించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీరెడ్డి, పి.దుర్గాప్రసాద్, మచ్చ నాగు తదితరులు పాల్గొన్నారు.



సెల్ఫీ ఛాలెంజ్ చేస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు

రౌతులపూడి తహశీల్దార్‌గా భీమారావు

ప్రజాశక్తి- రౌతులపూడి

రౌతులపూడి తహశీల్దారుగా జి.భీమారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ కలెక్టరేట్‌లో పని చేస్తూ బదిలీపై ఆయన రౌతులపూడి వచ్చారు. తహశీల్దారు తాసిల్దార్ భీమారావుకు రెవెన్యూ సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.



జి.భీమారావు

ఆణిముత్యాలకు అభినందన

ప్రజాశక్తి - తాళ్లరేవు

జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన ఇంజరం జెడ్‌పి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులను సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్ అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయుడు సింగంశెట్టి సత్య రామం తన తండ్రి జ్ఞాపకార్థం మొదటి, రెండు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి అందించారు. ఇంజరం హైస్కూల్ హెచ్ఎం కె.శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ జి.వెంకటరమణ, స్థానిక నాయకులు కోరుకొండ చంటి, విద్యార్థుల తల్లితండ్రులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న సర్పంచ్ ప్రసాద్

గుమ్మిలేరు చెరువును అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి-ఆలమూరు

మండంలోని గుమ్మిలేరు లోని చెరువును రుడా పరిధిలో అభివృద్ధి చేయాలని కోరుతూ గ్రామ సర్పంచ్ గుణ్ణం రాంబాబు కొత్తపేట ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డికి శుక్రవారం గోపాలపురంలో వినతిపత్రం అందజేశారు. ఇటీవల ఆలమూరు మండలాన్ని రుడా పరిధిలోనికి తీసుకొచ్చి మండలాన్ని విలీనం చేశారన్నారు. గుమ్మిలేరు చెరువును రుడాలో అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరుకు తన వంతు కృషి చేస్తానని ఎంఎల్ఎ జగ్గిరెడ్డి హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు.

మాజీ మంత్రి వెంకటరెడ్డి సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-మండపేట

మాజీమంత్రి సంగిత వెంకటరెడ్డి (చినకాపు) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేసిన సేవలు చిరస్మరణీయం అని టిడిపి మండపేట పట్టణ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు అన్నారు. చినకాపు వర్ధంతి సందర్భంగా స్థానిక బస్ షెల్టర్ వద్ద ఉన్న విగ్రహానికి, ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గుండు వీర తాతరాజు, చింతలపూడి సత్తిబాబు, సిరంగు ఈశ్వరరావు, అధికారి శ్రీనివాస్, జొన్నపల్లి సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
తూర్పుగోదావరి జిల్లా
24 జూన్ 2023
Advt.feature

రాష్ట్ర హోంమంత్రి శ్రీమతి తానేటి వనిత జన్మదినోత్సవ ప్రత్యేక అనుబంధం



వైసిపి ప్రభుత్వం మహిళా పక్షపాత ప్రభుత్వం. మహిళల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పలు పథకాలను ప్రవేశపెట్టడమే కాకుండా అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్నారని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. ఈ నెల 24వ తేదీ శనివారం ఆమె జన్మదినం నేపథ్యంలో ప్రజాశక్తికిచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు.

మహిళా పక్షపాతి వైసిపి

శ్రీమతి డా॥ తానేటి వనిత
రాష్ట్ర హోంశాఖామాత్యులు

ప్రజాశక్తి - కొవ్వూరు

కరోనా కష్టకాలం, అననుకూల ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో సంక్షేమ పథకాల అమలు తీరు ఎలా ఉంది?

కరోనా విపత్తు వచ్చినా సంక్షేమం మరువని, వదలని ప్రభుత్వం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం. సకాలంలో పింఛన్లు, ఎస్‌సి, ఎస్‌టి, బడుగు, బలహీనవర్గాల వారికి, ముఖ్యంగా మహిళలకు ఆర్థిక చేయూతను అందిస్తున్నాం. విద్యకు పెద్ద పీట వేసి అమ్మఒడి పథకాన్ని అమలు చేస్తున్నాం. ఆటో కార్మికులకు సకాలంలో నగదును వారి ఖాతాల్లోకి జమ చేశాం. మహిళల రక్షణకు దిశ చట్టాన్ని తీసుకొచ్చాం. దిశ యాప్‌ను అభివృద్ధి చేశాం. మహిళలకు దిశ రక్షణ కవచంలా ఉంది. ఇప్పటికే లక్షలాది మంది దీన్ని అప్‌లోడ్ చేసుకున్నారు. దిశ యాప్‌పై ఇప్పటికే గ్రామ స్థాయి నుంచి నగరస్థాయి వరకూ పోలీసులు అధికారులతో కలిసి అవగాహనా సదస్సులను నిర్వహించాం. దీనికి మంచి స్పందన వచ్చింది. విద్య, వైద్యం అందిరకీ అందేలా ప్రభుత్వం అన్ని చర్యలూ చేపట్టింది. అందులో భాగమే నాడు-నేడు, ఫ్యామిలీ ఫిజీషియన్, వెల్‌నెస్ సెంటర్లు వంటివి. ఇప్పుడు పేదల ఇంటి వద్దకే వైద్యం అందుతోంది.

నియోజకవర్గంలో సంక్షేమ పథకాల అమలు ఎలా ఉంది?

అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలు పొందాలనేది ముఖ్యమంత్రి ధ్యేయం. పారదర్శకంగా అర్హులైన వారందరినీ గుర్తించి వారికి కచ్చితంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. అమ్మఒడి, మత్స్యకార భరోసా, విద్యాదీవెన, రైతు భరోసా, అందరికీ ఇళ్లు తదితర పథకాలు ఇప్పటికే మంచి గుర్తింపు పొందాయి. వీటిని మరింత విస్తృతంగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నాం.

ప్రతిపక్షాల విమర్శలపై మీ స్పందన?

అభివృద్ధిని ఓర్వలేని ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలతో కాలయాపన చేస్తున్నాయి. ప్రతిపక్షాల

2లో

బయోడేటా..



పేరు : తానేటి వనిత
తండ్రి పేరు : జొన్నకూటి బాబాజీ రావు (1994, 99లో ఎంఎల్‌ఎగా ఎన్నికయ్యారు)
పుట్టిన తేది : 24 జూన్ 1973
వయస్సు : 48 సంవత్సరాలు
చదువు : ఎంఎస్‌సి జువాలజీ(ఎయు)
భర్త : డాక్టర్ శ్రీనివాసరావు, ఎమ్‌డి, వైద్యులు
కుమార్తె : ప్రణవి

రాజకీయం ప్రస్థానం: 2009 ఎన్నికల్లో గోపాలపురం నియోజకవర్గం నుంచి టిడిపి తరపున పోటీ చేసి విజయం సాధించారు. 2012లో టిడిపి సభ్యత్వానికి, ఎంఎల్‌ఎ పదవికి రాజీనామా చేసి వైసిపిలో చేరారు. 2014లో కొవ్వూరు నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2019లో కొవ్వూరు నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి 25,241 ఓట్ల మెజార్టీతో ఘనవిజయం సాధించారు. ఆపై రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం పొంది స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రిగా, రెండోసారి మంత్రి వర్గ విస్తరణలో రాష్ట్ర విపత్తులు, హోం శాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

మహిళా పక్షపాతి వైసిపి

విమర్శలను పట్టించుకునే స్థితిలో ప్రజలు లేరు. మహిళలు, కార్మికులు, ఉద్యోగులు, కూలీలు, ఆటో డ్రైవర్లు, చిరువ్యాపారులు ఇలా అందరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుంది.

పార్టీ బలోపేతంలో మీ పాత్ర?

మంత్రి: వైసిపి ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం. ప్రజలే ఈ ప్రభుత్వానికి అండదండలు. కార్యకర్తలే పార్టీకి పునాదిరాళ్లు. వారి సంక్షేమాన్ని కాపాడుతూ పార్టీని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తా. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. దీనికి ప్రజల నుంచి మంచి స్పందన ఉంది. ఈ కార్యక్రమంలో ప్రజలు తీసుకొస్తున్న సమస్యలను సాధ్యమైనంత వరకూ అక్కడికక్కడే పరిష్కరించేలా చూస్తున్నాను. అక్కడ పరిష్కారం కాని వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాం. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటా తిరిగి వివరిస్తున్నాం. పార్టీ బలోపేతానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదం చేస్తుంది.

2012లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి, 2014లో వైసిపి తరపున పోటీ చేసి ఓటమి పొందినప్పటికీ 2019లో 25,241 ఓట్ల మెజారిటీ ఎలా సాధ్యమైంది?


మంత్రి: 2014 ఎన్నికల్లో నెలల కాలంలోనే పోటీలో ఉన్నప్పటికీ ప్రత్యర్థికి సుమారు 12 వేల ఓట్ల మెజారిటీ మాత్రమే ప్రజలు ఇచ్చారు. అయితే మా పార్టీ మేనిఫెస్టో చూసిన ప్రజలు జగనన్న పరిపాలన చూడాలని భావించి అధిక మెజార్టీతో పార్టీని, మమ్మల్ని దీవించారు. అదేవిధంగా జగనన్న తన పార్టీ సిద్ధాంతాలను ఎన్ని ఒడుదొడుకులు ఎదురైనా కచ్చితంగా అమలు చేయడం చరిత్రలోనే గమనార్హం. రానున్న కాలంలోనూ ఈ పథకాలే మమ్మల్ని ముందుకు నడిపిస్తాయనే నమ్మకం ఉంది. పథకాలతోనే కాకుండా గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి ప్రతి ఎంఎల్ఎ వెళ్తున్నారు. సంక్షేమ పథకాల అమలు తీరుతో పాటూ వారి సమస్యలను తెలుసుకుంటూ అక్కడి కక్కడే కొన్నింటిని పరిష్కరిస్తున్నాం. దీర్ఘకాలిక సమస్యలపైనా దృష్టి పెడుతున్నాం. దీనికి ప్రజల నుంచి మంచి స్పందన కనిపిస్తుంది.

ఇసుక సరఫరాలో పారదర్శకత సాధ్యమేనా?

ఇసుక మాఫియా వైసిపిలో సాధ్యం కాదు. ఈ ప్రభుత్వంలో అవినీతికి చోటులేదు. కనుక కచ్చితంగా సామాన్యులకు సైతం ఇసుక అందేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వాటిని పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నాం. జగనన్న గృహ నిర్మాణాలకు సంబంధించి ముందుగానే ఇసుకను స్టాక్ పాయింట్లకు తరలించాం. గృహనిర్మాణాలకు, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకున్నాం.









కొవ్వూరు తొలి మహిళా ఎంఎల్ఎ
డాక్టర్ తానేటి వనిత

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరు నియోజకవర్గంలో 1962లో 71,105 మంది ఓటర్లు ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 1,69,675 మందికి చేరింది. 1952లో కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాలు కలిపి ఉండేవి. 1952లో జరిగిన ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థి పి.రామచంద్రరావు, కాంగ్రెస్ అభ్యర్థి అల్లూరి బాపినీడుపై గెలుపొందారు. 1955లోనూ గోపాలపురం నియోజకవర్గం కొవ్వూరులో భాగంగానే ఉంది. అయితే కొవ్వూరు జనరల్, కొవ్వూరు ఎస్‌సిగా ద్విసభ్య నియోజకవర్గం ఉంది. ఆ ఎన్నికల్లో జనరల్ సభ్యునిగా కాంగ్రెస్ అభ్యర్థి అల్లూరి బాపినీడు సిపిఐ అభ్యర్థి పి.రామచంద్రరావుపై గెలుపొందారు. ఎస్‌సి రిజర్వుడు సభ్యునిగా కాంగ్రెస్ అభ్యర్థి తానేటి వీర్రాఘవులు గెలుపొంది రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం సాధించారు. ఆయన విద్యా శాఖ మంత్రిగా పని చేశారు. 1962లో కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాలు వేర్వేరుగా ఏర్పడ్డాయి. 1967, 1972ల్లో జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులు కె.బుచ్చిరాయుడు, ఎ.హనుమంతరావు విజయకేతనం ఎగుర వేయడం విశేషం. 1978లో ఇందిరా కాంగ్రెస్ తరపున పోటీ చేసి గెలుపొందిన ఎం.ఎ.అజీజ్ రాష్ట్ర మంత్రిగా పని చేశారు. ఈయన తన సమీప ప్రత్యర్థి జనతా పార్టీ అభ్యర్థి అల్లూరి సర్వారాయుడుపై గెలుపొం దారు. 1983, 1985, 1989, 1994, 2004 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి పివి.కృష్ణారావు గెలుపొంది రికార్డు సృష్టించారు. 1999లో జరిగిన ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ అభ్యర్థి జిఎస్.రావు టిడిపి అభ్యర్థి పివి.కృష్ణారా వుపై గెలుపొంది సంచలనం సృష్టించారు. నియోజకవర్గాల పునర్విభజనలో కొవ్వూరు నియోజకవర్గాన్ని ఎస్‌సి రిజర్వుడుగా మార్చారు. ఈ నేపథ్యంలో 2009లో జరిగిన ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి టివి.రామారావు గెలుపొం దారు. 2014లో కెఎస్.జవహర్ వైసిపి అభ్యర్థి తానేటి వనితపై గెలుపొందారు. రాష్ట్ర మంత్రివర్గంలో జవహర్‌కు స్థానం లభించింది. ఎక్సైజ్ శాఖ మంత్రిగా పని చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసిపి నుంచి పోటీ చేసిన వనిత ఎంఎల్‌ఏగా గెలుపొందారు.

స్వాతంత్ర్యోద్యమంలో మల్లవరం

ఆనంద్ నికేతన్‌తో గ్రామానికి గుర్తింపు
నేటికీ నిరంతరాయంగా సేవలందిస్తున్న ఆశ్రమం

ప్రజాశక్తి - చాగల్లు

భారత స్వాతంత్ర్యోద్యమంలో మల్లవరానికి ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడ ఏర్పాటు చేసిన ఆనంద్ నికేతన్ ఆశ్రమం ద్వారా నాడు ఎంతో మంది స్వాతంత్ర్య సమరయోధులు తమ కార్యకలాపాలను నిర్వహించారు. అప్పటి నుంచి ఇప్పటికీ ఈ ఆశ్రమం ద్వారా సేవలందుతున్నాయి. దీన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాలనే డిమాండ్ కూడా ఇక్కడ వినిపిస్తోంది.

1920లో గాంధీజీ సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా ఆశ్రమాలను ఏర్పాటు చేశారు. వీటిలో సబర్మతి, వర్ధా ఆశ్రమాలు స్వరాజ్య సమరంలో కీలక పాత్ర పోషించాయి. మహాత్ముని ఆశయాలు అనుసరించేందుకు దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఆశ్రమాల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా చాగల్లు మండలం మల్లవరం గ్రామంలో నెలకొల్పిన ఆనంద్ నికేతం ఒకటి. 1923లో గాంధీజీ స్ఫూర్తితో యల్లాప్రగడ నరసింహాశర్మ,, విశ్వసుందరమ్మ దంపతులు గోదావరి గట్టు చెంతన దీన్ని ఏర్పాటు చేశారు. అనంతరం మల్లవరం గ్రామానికి చెందిన లంకసాని గంగరాజు దంపతులు ఆశ్రమం కోసం ఎకరం భూమిని దానం చేవారు. దీంతో పూర్తిస్థాయిలో నిర్మాణ పనులు చేపట్టారు. దళితులు, బడుగు, బలహీన వర్గాల పిల్లలను ఆశ్రమంలో చేర్చి, విద్యా బుద్ధులు, వత్తి పనులు నేర్పించారు. ఇంతటి మహత్తర కార్యక్రమాలను తిలకించేందుకు జెసి.కుమరప్ప, విఅర్.షిండే, సిఎఫ్. అందష్, స్వామి శ్రద్దనంద్ వంటి వారు ఆశ్రమాన్ని సందర్శించారు. అనంతరం మహాత్మా గాంధీ 1929 ఏప్రిల్ 27న మల్లవరం ఆశ్రమాన్ని సందర్శించి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అక్కడ ఒక రోజు బస చేసి అనంతరం కొవ్వూరుకు వెళ్లారు.



ఆశ్రమం భవనం

గాంధీజీ పిలుపుతో పశ్చిమలో ఉప్పు సత్యాగ్రహం మట్లపాలెం నుంచి మొదలుపెట్టారు. ప్రతి ఆశ్రమం నుంచి 20 మంది విధిగా రావాలని పిలుపు నిచ్చారు. ఇందులో పాల్గొనేందుకు ఆశ్రమంలో ఉంటున్న పలువురు సన్నద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిపై లాఠీఛార్జి చేశారు. ఈ సమయంలో కొందరు గాయపడ్డారు. మరికొందరు అరెస్ట్ అయ్యి జైలుపాలయ్యారు. అనంతరం మద్యనిషేధం, ఖాదీ ప్రచారం చేయమని కాంగ్రెస్ నిర్ణయానికి కట్టుబడి ఆశ్రమ విద్యార్థులు సోలా విష్ణు, పుచ్చలపల్లి సుందరయ్య, మద్దుకురి దొరయ్య, పళ్ల తమ్మయ్య మొదలైనవారు చెట్లు నరికే కార్యక్రమంలో పాల్గొన్నారు వీరిని పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు

క్విట్ ఇండియా ఉద్యమంలో కీలక పాత్ర

క్విట్ ఇండియా ఉద్యమంలో ఆశ్రమ వాసులు, విద్యార్ధులు కిలకపాత్ర పోషిం చారు. చావో, బతుకో - విజయమో వీర స్వర్గమా వంటి నినాదాలతో ఉరకలు తీశారు. దీంతో ప్రభుత్వం తీవ్రంగా స్పందించి ఆశ్రమాలను పూర్తిగా ధ్వంసం చేసింది. 1948లో గాంధీజీ మరణం అనంతరం నరసింహ శర్మ గాంధీ స్మారక నిధి ఏర్పాటు చేశారు. దీనితో భవనాన్ని నిర్మించారు. అప్పటి నుంచి 1980 వరకు ఆశ్రహం కొనసాగింది. అనంతరం ఈ ఆశ్రమాన్ని అప్పటి అధ్యక్షుడు చింతలపాటి సీతరామచంద్ర వరప్రసాద్ మరల ఆశ్రమాన్ని స్థాపించి ఆ బాధ్యతలను సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాద్ రాజుకు అప్పగించారు. 2011 నుంచి నేటి వరకు ఎన్నో సేవా కార్యక్రమాలను ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

ఓడిన చోటే సత్తా చాటిన ధీర'వనిత'

ప్రజాశక్తి - కొవ్వూరు

2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి డాక్టర్ తానేటి వనిత కొవ్వూరు నియోజకవర్గం నుంచి 25,241 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. కొవ్వూరు నియోజకవర్గం నుంచి ఇంత భారీ మేజార్టీతో నెగ్గిన ఏకైక మహిళా ఎంఎల్ఎగా తానేటి వనిత చరిత్ర పుట్టలకెక్కారు. వనిత తన సమీప ప్రత్యర్థి టిడిపికి చెందిన వంగలపూడి అనితపై ఘన విజయం సాధించారు. 2009లో గోపాలపురం నియోజకవర్గం నుంచి శాసన సభకు ఎన్నికైన ఆమె 2012లో సభ్యత్వానికి రాజీనామా చేసి వైసిపిలో చేరారు. అప్పటి నుంచి పార్టీ పట్ల విధేయత, అంకిత భావంతో పనిచేశారు. పార్టీ నిర్దేశించిన పల్లె నిద్ర, గడప గడపకూ మన ప్రభుత్వం, రచ్చబండ, రెండో విడత గడప గడపకు వంటి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముఖ్యంగా ప్రజల్లోకి నవ రత్నాలను బలంగా తీసుకెళ్లారు. నియోజకవర్గంలో వైసిపి బలోపేతానికి ఏడు సంవత్సరాల్లో ఎంతో కృషి చేశారు. 2014లో వైసిపి తరపున కొవ్వూరు నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ నిరాశ పడకుండా నిత్యం ప్రజల్లో ఉన్నారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ప్రతి పక్ష పాత్ర పోషిస్తూ గత ఏడు సంవత్సరాలుగా నియోజకవర్గంలో అనేక ప్రజా సమస్యలపై పోరాటాలు చేశారు. ఇసుక మాఫియా నియంత్రణకు, మద్యం ఎంఆర్‌పి రేట్లకే అమ్మాలని, బెల్టు షాపులను తొలగించాలని పలు పోరాటాలు చేశారు. 2019 సాధారణ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా కొవ్వూరు నియోజకవర్గం నుంచి బరిలోకి దిగారు. ఈ ఎన్నికల్లో ఆమె ఘన విజయం సాధించారు. ఎంఎల్ఎగా గెలుపొందిన తర్వాత కొవ్వూరులో మద్యం ఎంఆర్‌పికే అమ్మేలా చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగానే బ్రాందీ షాపుల వద్ద ఎంఆర్‌పి రేట్లకే అనే బోర్డులు కూడా పెట్టేలా చర్యలు తీసుకున్నారు. కొవ్వూరులో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేశారు. సిఎంను తీసుకొచ్చి పలు అభివృద్ధి పనులు చేయించారు.

జగన్ సారథ్యంలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో, హోం మంత్రి తానేటి వనిత సహకారంతో ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయి. అభివద్ధి అంటే జగన్ ప్రభుత్వం అని నాలుగేళ్లలో నిరూపించాం. నవరత్నాల పేరుతో ప్రతి ఒక్కరి కుటుంబంలో వెలుగులు నింపి అభివృద్ధి వైపు పరుగులు తీస్తున్నాం. అధికారంలోకొచ్చిన తర్వాత వాలంటరీ వ్యవస్థ నుంచి అమ్మవడి, నాడు - నేడు వంటి బృహత్తర కార్యక్రమాలు చేపట్టిన ఘనత వైసిపి సర్కారుకే దక్కుతుంది. వీటిని నేడు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అనుసరిస్తూన్నారు. ప్రధానంగా ఇళ్ల స్థలాల పంపిణీలో ఏ ప్రభుత్వం చేయని సాహసం జగన్ చేసి చరిత్రలో నిలిచారు. ఎస్సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం నిరంతరాయంగా కృషి చేస్తుంది. రానున్న రెండేళ్లలో కొవ్వూరు నియోజకవర్గంలో చాగల్లు మండలాన్ని మంత్రి వనిత సహకారంతో అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉంచుతాం.

–మట్టా వీరాస్వామి, ఎంపిపి, చాగల్లు

అభివృద్ధి పథంలో తాళ్లపూడి



పల్లె సీమలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించాలనే సిఎం ఆలోచన మేరకు హోం మంత్రి తానేటి వనిత ఆశీస్సులతో తాళ్లపూడిని అభివృద్ధి చేస్తున్నాను. తాళ్లపూడి మెయిన్ రోడ్‌లో దశాబ్దాల కాలంగా పరిష్కారానికి నోచుకోని డ్రెయినేజీ సమస్యకు పూర్తి పరిష్కారం చూపనున్నాం. ఇక్కడ డ్రెయినేజీ నిర్మాణానికి ఆలోచన చేస్తున్నాం. తాళ్లపూడిలో సచివాలయం ఒకటి పైభాగంలో రూ.25 లక్షలతో అదనపు భవనం నిర్మాణంతో పాటు రూ.40 లక్షలతో మరో సచివాలయాన్ని నిర్మించనున్నాం. రూ.44 లక్షలతో రెండు రైతు భరోసా కేంద్రాలు నిర్మాణం చేపట్టగా ఒకటి పూర్తయింది. మరోది నిర్మాణ దశలో ఉంది. రూ.14 లక్షలతో దళిత పేటలో రోడ్లు నిర్మించాం. డ్రెయిన్లలో సిల్టు తొలగింపు పనులకు చర్యలు చేపట్టాం. కొత్త మురుగు కాలువల నిర్మాణానికి కూడా చర్యలు తీసుకున్నాం.

- నక్కా వెంకట అనురాధ, సర్పంచ్, తాళ్లపూడి

ప్రజల అభివృద్ధే ధ్యేయంగా..



అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం నవరత్నాల పేరుతో వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడంలో తమ ప్రభుత్వం ముందుంది. హోం మంత్రి తానేటి వనిత కృషితో నియోజకవర్గంలో అందరికీ పథకాలు అందుతున్నాయి. ప్రజలకు సంక్షేమ పథకాలను సకాలంలో నేరుగా అందించేందుకు అమలు చేస్తున్న వాలంటీర్ వ్యవస్థ ప్రజల మన్ననలు పొందింది. ఉన్నత చదువులు పొందలేని విద్యార్థుల కోసం అమలు చేస్తున్న విద్యా పథకాలు పట్ల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విద్య కోసం పలు పథకాలను ప్రవేశపెట్టిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కింది. రానున్న కాలంలో జగనన్న సర్కారు మరిన్ని సంక్షేమ పథకాలను అందించబోతోంది.

- నక్కా చిట్టిబాబు, వైసిపి బిసి నాయకులు

వనితమ్మ ఆశీస్సులతో సొసైటీ అభివృద్ధి



జగనన్న పాలనలో హోం మంత్రి తానేటి వనిత ఆశీస్సులతో అన్నదేవరపేట సహకార బ్యాంకును అభివృద్ధి పథంతో నడుపుతున్నాం. రైతన్నలకు సాగుకు అవసరమైన అవసరాలను సకాలంలో అందిస్తున్నాం. సొసైటీ అభివృద్ధిలో భాగంగా అన్నదేవరపేట గ్రామంలో సొసైటీ సహకారంతో పెట్రోల్ పంపు నిర్మించి వాహనదారులకు సేవలు అందిస్తున్నాం. అన్ని వర్గాల ప్రజలు అభివద్ధి సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి వైసిపి ప్రభుత్వం పలు పథకాలను అందిస్తుంది. అందరికీ సొంత ఇల్లు ఉండాలనే ఆలోచనతో ఎక్కడా లేని విధంగా అన్నదేవరపేట శివారు సూరయ్యపేట సమీపంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన సుమారు 950 మందికి పైగా లబ్ధిదారులకు వైఎస్ఆర్ నగర్ పేరుతో ఇళ్ల స్థలాలు అందించడంలో మంత్రి వనిత కృషి ఎనలేనిది.

- పోసిన శ్రీకృష్ణదేవరాయలు, సొసైటీ అధ్యక్షులు

మంత్రుల ఖిల్లా.. కొవ్వూరు



రాష్ట్రమంత్రివర్గంలో ఇప్పటి వరకూ నలుగురికి చోటు

కొవ్వూరు నుంచి తొలి మహిళా మంత్రి వనిత

కొవ్వూరు నియోజకవర్గ చరిత్ర



ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరు నియోజకవర్గంలో 1962లో 71,105 మంది ఓటర్లు ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 1,69,675 మందికి చేరింది. 1952లో కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాలు కలిపి ఉండేవి. 1952లో జరిగిన ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థి పి.రామచంద్రరావు, కాంగ్రెస్ అభ్యర్థి అల్లూరి బాపినీడుపై గెలుపొందారు. 1955లోనూ గోపాలపురం నియోజకవర్గం కొవ్వూరులో భాగంగానే ఉంది. అయితే కొవ్వూరు జనరల్, కొవ్వూరు ఎస్‌సిగా ద్విసభ్య నియోజకవర్గం ఉంది. ఆ ఎన్నికల్లో జనరల్ సభ్యునిగా కాంగ్రెస్ అభ్యర్థి అల్లూరి బాపినీడు సిపిఐ అభ్యర్థి పి.రామచంద్రరావుపై గెలుపొందారు. ఎస్‌సి రిజర్వుడు సభ్యునిగా కాంగ్రెస్ అభ్యర్థి తానేటి వీర్రాఘవులు గెలుపొంది రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం సాధించారు. ఆయన విద్యా శాఖమంత్రిగా పని చేశారు. 1962లో కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాలు వేర్వేరుగా ఏర్పడ్డాయి. 1967, 1972ల్లో జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులు కె.బుచ్చిరాయుడు, ఎ.హనుమంతరావు విజయకేతనం ఎగురవేయడం విశేషం. వీరు కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించి సంచలనం సృష్టించారు. 1978లో ఇందిరా కాంగ్రెస్ తరపున పోటీ చేసి గెలుపొందిన ఎం.ఎ.అజీజ్ రాష్ట్ర మంత్రిగా పని చేశారు. ఈయన తన సమీప ప్రత్యర్థి జనతా పార్టీ అభ్యర్థి అల్లూరి సర్వారాయుడుపై గెలుపొం దారు. 1983, 1985, 1989, 1994, 2004 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి పివి.కృష్ణారావు గెలుపొంది రికార్డు సృష్టించారు. 1999లో జరిగిన ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ అభ్యర్థి జిఎస్.రావు టిడిపి అభ్యర్థి పివి.కృష్ణారా వుపై గెలుపొంది సంచలనం సృష్టించారు. నియోజకవర్గాల పునర్వి భజనలో కొవ్వూరు నియోజకవర్గాన్ని ఎస్‌సి రిజర్వుడుగా మార్చారు. ఈ నేపథ్యంలో 2009లో జరిగిన ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి టివి.రామారావు గెలుపొం దారు. 2014లో కెఎస్.జవహర్ వైసిపి అభ్యర్థి తానేటి వనితపై గెలుపొందారు. రాష్ట్ర మంత్రివర్గంలో జవహర్‌కు స్థానం లభించింది. ఎక్సైజ్ శాఖ మంత్రిగా పని చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసిపి నుంచి పోటీ చేసిన వనిత ఎంఎల్ఎగా గెలుపొందడంతోపాటు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకుని రాష్ట్ర హోం శాఖా మంత్రిగా బాధ్యతలును విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

నాటి నుంచి నేటి వరకూ...

కొవ్వూరు నియోజకవర్గం ఏర్పడిన 1955 నుంచి ఇప్పటి వరకూ 14 సార్లు శాసన సభ ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్, టిడిపి, వైసిపిల నుంచి పోటీచేసిన అభ్యర్థులకే కాకుండా స్వతంత్రంగా పోటీచేసిన అభ్యర్థులకూ ఇక్కడ ఓటర్లు పట్టం కట్టారు. 1967లో కెబి.రాయుడు, 1972లో ఆళ్ల హనుమంతురావు వంటి వారు స్వతంత్ర అభ్యర్థులుగా ఇక్కడి నుంచి రంగంలోకి దిగి విజయం సాధించారు. అలాగే 1983లో పెండ్యాల వెంకటకృష్ణారావు స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో దిగి విజయం సాధించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి మూడు సార్లు ఎంఎల్ఎగా విజయం సాధించి సేవలందించారు. 1955లో అల్లూరి బాపినీడు కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసి కొవ్వూరు నియోజకవర్గానికి తొలి ఎంఎల్ఎగా నిలిచారు. అలాగే అదే పార్టీ నుంచి 1962లోనూ ఆయన పోటీ చేసి ఎంఎల్ఎగా గెలుపొందారు. తరువాత జరిగిన పరిణామాల అనంతరం 1978లో ముని్ష అబ్దుల్ అజీజ్ కాంగ్రెస్(ఐ) అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. చివరి సారిగా కాంగ్రెస్ అభ్యర్థి జిఎస్.రావు 1999లో కొవ్వూరు ఎంఎల్ఎగా సేవలందించారు. తరువాత నుంచి టిడిపి హయాం కొనసాగింది. 2004, 2009, 2014లో టిడిపి అభ్యర్థులు వరుసగా గెలుపొందారు. వీరి హవాకు వైసిపి అభ్యర్థి తానేటి వనిత 2019లో బ్రేకులు వేశారు. అప్పటి టిడిపి మంత్రి జవహర్‌పై ఆమె విజయఢంగా మోగించారు. అనంతరం ఆమె మాతా శిశుసంక్షేమ శాఖ మంత్రిగా, ప్రస్తుతం హోం మంత్రిగా కొనసాగుతున్నారు.

కొవ్వూరుకు సేవలందించిన ఎంఎల్ఎలు వీరే...

1. 1955	అల్లూరి బాపినీడు	కాంగ్రెస్
2. 1962	అల్లూరి బాపినీడు	కాంగ్రెస్
3. 1967	కెబి.రాయుడు	స్వతంత్ర
4. 1972	ఆళ్ల హనుమంతరావు	స్వతంత్ర
5. 1978	ముని్ష అబ్దుల్ అజీజ్	కాంగ్రెస్(ఐ)
6. 1983	పెండ్యాల వెంకటకృష్ణారావు	స్వతంత్ర
7. 1985	పెండ్యాల వెంకటకృష్ణారావు	టిడిపి
8. 1989	పెండ్యాల వెంకటకృష్ణారావు	టిడిపి
9. 1994	పెండ్యాల వెంకటకృష్ణారావు	టిడిపి
10. 1999	జిఎస్.రావు	కాంగ్రెస్
11. 2004	పెండ్యాల వెంకటకృష్ణారావు	టిడిపి
12. 2009	టివి.రామారావు	టిడిపి
13. 2014	కొత్తపల్లి శామ్యూల్ జవహర్	టిడిపి
14. 2019	తానేటి వనిత	వైసిపి

మంత్రి సహకారంతో.. సమస్యల పరిష్కారం

డిసిసిబి వైస్ ఛైర్మన్ ఆత్మూరి దొరయ్య

ప్రజాశక్తి - చాగల్లు



ప్రజా సమస్యలపై నిరంతరం దృష్టి సారించి, మంత్రి తానేటి వనిత సహకారంతో వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని డిసిసిబి వైస్ ఛైర్మన్ ఆత్మూరి దొరయ్య తెలిపారు. ఈ నెల 24న మంత్రి తానేటి వనిత జన్మదిన వేడుకను పురస్కరించుకుని ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే రైతు సంక్షేమం కోసం ఎనలేని పథకాలు తీసుకొచ్చారన్నారు. ప్రధానంగా సొసైటీల అభివృద్ధికి నేరుగా అధ్యక్షులను ఎంపిక చేసి సేవలను విస్తృతం చేశారని తెలిపారు. రైతు భరోసా కేంద్రాలతో పాటూ సొసైటీల ద్వారా విత్తనాల దగ్గర నుంచి పురుగుమందుల విక్రయాల వరకు రాయితీలపై రైతులకు సకాలంలో అందిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రధానంగా నిడదవోలు సర్కిల్ పరిధిలోని 17 సొసైటీల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి కొనుగోలు సొమ్ము జమ చేయడం హర్షణీయమన్నారు. రానున్న కాలంలో తమ సొసైటీ ద్వారా పెట్రోలు బంకు సేవలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అలాగే ప్రజలకు రక్షిత మంచినీటిని అందించేందుకు నిర్ణయించామని తెలిపారు. ఇందులో భాగంగా శుద్ధి చేసిన తాగునీటి పంపిణీకి ఆర్‌ఓ ప్లాంట్ నిర్మాణానికి కృషి చేస్తున్నామని వివరించారు. జిల్లాల్లో ఎక్కడా లేనివిధంగా సొసైటీ పరిధిలో గోడౌన్ నిర్మించి పౌరసరఫరాల శాఖ ద్వారా నిత్యావసర సరుకులు ఇస్తున్నామని పేర్కొన్నారు. కౌలు రైతులకు రుణాలను అందిస్తున్నామని తెలిపారు. వాటితో పాటు విద్య, వైద్య రంగాలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తుఆన్నమన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో చిరకాలం నిలిచిపోతాయని ఉద్ఘాటించారు. రానున్న కాలంలో మరిన్ని సంక్షేమ పథకాలను కూడా అందిస్తారని తెలిపారు.